సాక్షి తిరుపతి

ఆదివారం । 13 । జూలై । 2025



తమ్ముళ్ల కీచులాట

'సుపరిపాలన తొలి అడుగు'లో భాగంగా శనివారం జీవీఎస్ కండ్రిగలో తెలుగు తమ్ముళ్లు తోపులాడుకున్నారు. - 8లో



ప్రాణాలతో చెలగాటమా?

విద్యుత్ లైట్లను వెలిగించకుండా ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని భూమన అభినయరెడ్డి నిరసన చేపట్టారు. - 8లో



స్వచ్ఛ సిటీగా తిరుపతి

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులలో భాగంగా స్వచ్ఛ సిటీగా తిరుపతి ఎంపిక అయినట్లు అధికారులు ప్రకటించారు. - 8లో

న్యూస్‌రీల్

ఇది బాధాకరం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి: జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగరం వినుతపై వచ్చిన అభియోగాలపై స్థానిక ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి స్పందించారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ నగరం వినుత వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్యకు గురికావడం.. ఆ కేసులో వినుత, ఆమె భర్త చంద్రబాబు, మరో ముగ్గురు అరెస్టు కావడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. శ్రీనివాసులు హత్యకు గురికావడం చాలా బాధాకరమన్నారు. పార్టీలో నుంచి సస్పెండ్ చేసిన విషయాన్ని తెలుసుకుని ఆయన సానుభూతిని తెలిపారు. కొంతమంది వ్యక్తులు చెన్నైకి రెండు వాహనాల్లో రాయుడు మృతదేహాన్ని తరలించిన విషయం తనకు పోలీసుల ద్వారా ముందే సమాచారం తెలిసిందన్నారు. దానిని ప్రతిపక్షాలు శవరాజకీయాలకు వాడుకుంటాయని ఈ విషయాన్ని తాను బహిర్గతం చేయయలేదని చెప్పారు. ఆ యువకుని హత్యకు, పార్టీలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. ఈ హత్యకు పాల్పడిన వారిని పోలీసులు కఠినంగా శిక్షిస్తారని చెప్పారు. శ్రీనివాసులు మృతదేహాన్ని శ్రీకాళహస్తికి తీసుకొస్తున్నారని, అతని అంత్యక్రియల్లో తానే స్వయంగా పాల్గొంటానని స్పష్టం చేశారు.

త్వరలో ఎస్పీడబ్ల్యూజే కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

తిరుపతి ఎడ్యుకేషన్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న శ్రీపద్మావతి ఉమెన్స్ జూనియర్ (ఎస్పీడబ్ల్యూజే) కళాశాలలో త్వరలో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నారు. ఆ మేరకు కళాశాల ప్రిన్సిపల్ ఒక ప్రకటనలో తెలిపారు. స్పాట్ అడ్మిషన్ల తేదీల సమాచారాన్ని టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లోని ''ఏడీఎంఐఎస్ఎస్ఐఓఎన్.టీఐఆర్‌యూఎంఏఎల్ఏ.ఓఆర్‌జీ'' అనే పోర్టల్, పత్రికల్లో ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే విద్యార్థుల మొబైల్స్‌కు సమాచారం పంపనున్నట్లు తెలిపారు. ఈ విషయాన్ని దరఖాస్తు చేసుకున్న విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు గమనించి స్పాట్ అడ్మిషన్ల తేదీలను ప్రకటించిన తరువాత ఆయా రోజుల్లో కళాశాలకు నేరుగా హాజరై అడ్మిషన్లు పొందాలని ప్రిన్సిపల్ సూచించారు.

ఈసీ మీటింగ్ తర్వాతే ఎంపిక జాబితా

తిరుపతి సిటీ : ఎస్వీయూలో అకడమిక్ కన్సల్టెంట్లకు ఫెర్ఫార్మెన్స్ రివ్యూ పేరుతో గత వారం జరిగిన ఇంటర్వ్యూలకు సంబంధించి ఎంపిక జాబితా విడుదల ఆలస్యం కానుంది. వచ్చే వారంలో ఈసీ సమావేశం నిర్వహించి ఆమోదముద్ర పడిన తర్వాత విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. దీంతో తాత్కాలిక అధ్యాపకుల అర్హుల జాబితా ఎప్పుడు విడుదలయ్యేనా...అందులో తమ పేరు ఉంటుందో లేదో అనే టెన్షన్‌తో ఉన్నామని అధ్యాపకులు మధ్య చర్చ సాగుతోంది. ఇంజినీరింగ్ విభాగం. సైన్స్ విభాగాలలో పనిచేసే అధ్యాపకులకు డోకా ఉండదని, కేవలం సెల్ఫ్ సపోర్టింగ్ కోర్సులు, ఆర్ట్స్ గ్రూపులలో పని చేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల పరిస్థితి ఆగమ్యగోచరంగా తయారైందనే వార్తలు వర్సిటీలో చక్కర్లు కొడుతున్నాయి.

వినుత పన్నాగం!



జనసేన నాయకురాలు వినుత, ఆమె భర్త చంద్రశేఖర్ నాయుడుతో ఆమె డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(ఫైల్)

శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జ్ డ్రైవర్ దారుణ హత్య

- రాజకీయ వ్యూహాలు చేరవేస్తున్నాడని గత నెలలో డ్రైవర్‌గా తొలగింపు
- వ్యక్తిగత రహస్యాలు బట్టబయలవుతాయని కడతేర్చిన వైనం
- జనసేన నుంచి వినుతను తప్పిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు

ఏర్పేడు : చిన్న వయస్సులోనే పెద్ద పదవి వరించింది.. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకుని ప్రతి అంశాన్నీ వివాదాస్పదం చేస్తూ.. పబ్లిసిటీ స్టంట్‌తో నెట్టుకొచ్చిన కోట వినుత అసలు బండారం బట్టబయలైంది. అంతర్గత వ్యవహారాల సమాచారాన్ని శ్రీకాళహస్తిలోని ఓ కీలక నాయకుడికి చేరవేస్తున్నాడని భావించింది. తన వద్ద డ్రైవర్‌గా పనిచేసే శ్రీనివాసులు అలియాస్ రాయుడు(22)ను కిరాతకంగా చంపించి చెన్నైలోని ఓ నదిలో పడవేసినట్లు చెన్నై పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు రావడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు, మరో ముగ్గురు పార్టీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని తీవ్ర స్థాయిలో విచారిస్తుండడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది.

సాధారణ యువతి నుంచి..

రేణిగుంటకు చెందిన నగరం వినుత తండ్రి నగరం భాస్కర్ స్థానికంగా మెడికల్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. నగరం వినుత తండ్రికి సహాయపడుతూ ఉండేది. ఈ క్రమంలోనే తన కళాశాలలో పరిచయమైన చిత్తూరు జిల్లా, బంగారుపాళెంకు చెందిన కోట చంద్రశేఖర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే పవన్ కల్యాణ్ జనసేన పార్టీలో చేరడం, ఆమెకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పదవి దక్కడం.. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి కేవలం 5 వేల ఓట్లు పడడంతో డిపాజిట్ కోల్పోయింది. ఎలాగైన వార్తల్లో ఉండాలని నిత్యం అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ వచ్చేది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఆమెపై పార్టీలోని ఓ వర్గం వ్యతిరేకంగా ఉండడం, ఆశించిన ఆదరణ లేకపోవడంతో టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వినుతను పట్టించుకోవడం మానేశారు.

చిన్నప్పుడే తల్లిదండ్రులు కోల్పోయాడు. ఎవరూ లేని అనాథగా మిగిలాడు. తన అమ్మమ్మ వద్ద పెరిగి పెద్దవాడయ్యాడు. కొన్నేళ్ల తర్వాత తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేన పార్టీలో చేరాడు. ఆపై పార్టీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ వినుత వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా.. డ్రైవర్‌గా విధుల్లో చేరాడు. చిన్నప్పటి నుంచి నమ్మినబంటుగా మెలిగాడు. ఏమైందో ఏమోగానీ ఇటీవల అతనిపై అనుమానం పెంచుకున్నారు. విధుల నుంచి సైతం తొలగించేశారు. వ్యక్తిగత రహస్యాలు, పార్టీ కార్యకలాపాలు బయటపెడుతున్నాడన్న కక్షతో అతికిరాతకంగా చంపేశారు. మృతదేహాన్ని చెన్నైకి తీసుకెళ్లి ఓ నదిలో పడేసి చేతులు దులుపుకోవాలని చూశారు. అయితే అక్కడి పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది.

ఎవరీ శ్రీనివాసులు ?

శ్రీకాళహస్తి మండలం, బొక్కసంపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడుకు ఏడేళ్ల వయస్సులోనే అతడి తల్లిదండ్రులు వెంకటరాయుడు, గీత చనిపోయారు. వీరి స్వగ్రామం వెంకటగిరి సమీపంలోని తోలుమిట్ట. అయితే శ్రీనివాసులు, అతడి సోదరిని అమ్మమ్మ రాజేశ్వరి శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెంకు తీసుకొచ్చి పెంచి పోషించింది. శ్రీనివాసులుకు పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో జనసేన పార్టీలో కార్యకర్తగా చురుగ్గా పాల్గొనేవాడు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన కోట వినుతకు దగ్గరయ్యాడు. 15 ఏళ్లుగా వారికి నమ్మిన బంటుగా ఉండడంతో ఆమెకు వ్యక్తిగత సహాయకుడిగా, కారు డ్రైవర్‌గా చేరాడు. ప్రతి కార్యక్రమంలోనూ వారిని వెంటబెట్టుకుని ఉంటూ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా మారిపోయాడు.

నిందితులను పట్టించిన పచ్చబొట్టు

చెన్నై నగరం, నార్త్ జోన్ సెవన్ వెల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైనేజీ కాల్వలో యువకుడి మృతదేహాన్ని ఈనెల 8వ తేదీన గుర్తించిన పోలీసులు పోస్టుమార్టంలో హత్య జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే మృతుడి చేతి మీద జనసేన పార్టీ గుర్తు, వినుత పేరు పచ్చబొట్టు ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు కొనసాగించారు. సీసీ ఫుటేజ్ లభించడంతో శనివారం తెల్లవారుజామున శ్రీకాళహస్తికి చేరుకున్న చెన్నై పోలీసులు జనసేన ఇన్‌చార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు, హత్యకు సహకరించిన రేణిగుంటకు చెందిన దస్తా సాహెబ్, శ్రీకాళహస్తికి చెందిన కె.శివకుమార్, తొట్టంబేడు మండలానికి చెందిన ఎస్.గోపిని తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేసి చెన్నైకి తీసుకెళ్లారు.

హత్య ఎందుకు జరిగింది..ఎలా చేశారంటే?

జనసేన నేత వినుత వద్ద ఉన్న శ్రీనివాసులుపై నిఘా పెట్టిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ముఖ్య నేత అతడికి డబ్బులు ఎర చూపి, వారి రాజకీయ వ్యూహాలు, ఇతర వ్యక్తిగత విషయాలకు సంబంధించి కీలక సమాచారాన్ని తెలుసుకున్నట్లు సమాచారం. దీన్ని కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు గుర్తించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే గత నెల 21న శ్రీనివాసులును విధుల నుంచి తొలగించారు. అయితే కోట వినుతతో ఉన్న కొన్ని వీడియోలు బయట పడడంతో అతడిని మట్టుబెట్టాలని గత నెలలోనే పక్కా ప్లాన్ వేసినట్లు చెన్నై పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే అందులోని కొన్ని వీడియోలు బహిర్గతం కావడంతో జీర్ణించుకోలేని కోట చంద్రశేఖర్‌నాయుడు అతడిని ఎలాగైనా అంతమొందించాలని భావించినట్టు తెలిసింది. తలచిందే తడువుగా పక్కా ప్లాన్ ప్రకారం పార్టీలోని మరో నలుగురు వ్యక్తుల సహాయంతో శ్రీనివాసులును శ్రీకాళహస్తిలోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లి అక్కడ విచక్షణా రహితంగా కొట్టి చంపినట్టు చెన్నై పోలీసులు భావిస్తున్నారు. అక్కడి నుంచి కారులో చెన్నైకి తీసుకెళ్లి మింట్ ఏరియా కూవం నదిలో పడేసి ఆంధ్రాకు తిరిగి వచ్చేశారని చెన్నై పోలీసులు వెల్లడించారు.

జనసేన నుంచి కోట వినుత బహిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుతను జనసేన పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు. కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు వినుత దూరంగా ఉన్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వారు ఆ వివరాలు వెల్లడించారు. చెన్నైలో వినుతపై హత్యా నేర అభియోగం నమోదు కావడంతో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు వారు చెప్పారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



గ్రాప్లింగ్ పోటీలను ప్రారంభిస్తున్న మాణిక్యాలు, చంద్రప్ప

తిరుపతి ఎడ్యుకేషన్ : క్రీడల ద్వారా మానసిక, శారీరక దృఢత్వంతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ పెంపొందుతాయని ఒలంపియన్, ఏపీ క్రీడా భారతీ అధ్యక్షుడు ఎంపీ. మాణిక్యాలు తెలిపారు. రాష్ట్ర గ్రాప్లింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్రాప్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్ షిప్ పోటీలను తిరుపతిలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేశారు. రెండు రోజుల పాటు నిర్వహించే ఈ పోటీలను శనివారం సాయంత్రం ఆయన ప్రారంభించి మాట్లాడారు. అనంతరం రాష్ట్ర నలుమూలల నుంచి హాజరైన క్రీడాకారులతో సబ్-జూనియర్స్, క్యాడెట్ (బాలురు, బాలికలు) విభాగాలుగా విభజించి పోటీలను నిర్వహించారు. ఆదివారం తుది పోటీలను నిర్వహించి విజేతలకు పతకాలు, బహుమతులు అందజేయనున్నారు. ఆయా విభాగాల్లో ప్రతిభ చూపిన క్రీడాకారులు ఈనెల 26 నుంచి 29వ తేదీ వరకు చత్తీస్‌గడ్ రాష్ట్రం, బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో పాల్గొననున్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సి.చంద్రప్ప, ఏపీ క్రీడా భారతీ కార్యదర్శి పి.ధనంజయరెడ్డి, డీఎస్‌డీఓ శశిధర్, విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డి, ఎస్‌జీఎఫ్ తిరుపతి జిల్లా మాజీ కార్యదర్శి జయరామయ్య, ఏపీ ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి మురళీకృష్ణ, ఏపీ గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఏజీ.రేఖారాణి, క్రీడా భారతీ జాయింట్ సెక్రటరీ సురేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఈలో అదనంగా మరో 60 సీట్లు

తిరుపతి సిటీ : ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సుకు సంబంధించి ప్రస్తుతం ఉన్న 60 సీట్లతో పాటు మరో 60 సీట్లు పెంచేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆ కోర్సుకు ఉన్న డిమాండ్ నేపథ్యంలో 60 సీట్లు పెంచి మొత్తం 120 సీట్లు ఈ ఏడాది భర్తీ చేయనున్నట్లు తెలిసింది. ప్రస్తుతం ప్రభుత్వ కోటా కింద ఉన్న 60 సీట్లతో పాటు సెల్ఫ్ ఫెనాన్స్ కింద మరో 120, మొత్తం 180 సీట్లు సీఎస్ఈ విభాగంలో ప్రవేశాలు కల్పించనున్నారు.

ఆగస్టు 3న యోగాసన పోటీలు

తిరుపతి ఎడ్యుకేషన్: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆగస్టు 3న జిల్లా స్థాయి యోగాసన పోటీలను నిర్వహించనున్నట్లు ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కైలాష్‌సింగ్ రాజ్ పురోహిత్, ముని మంజుల ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరచిన వారిని రాష్ట్ర స్థాయి యోగాసన పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు 99853 94350, 99080 42143, 94904 20270 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

గజ వాహనంపై సిరులతల్లి



గజ వాహనంపై విహరిస్తున్న పద్మావతి అమ్మవారు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారు గజ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. అమ్మవారి జన్మ నక్షత్రమైన ఉత్తరాషాడ సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. అనంతరం అమ్మవారికి అభిషేక కార్యక్రమాలను చేపట్టి శోభాయమానంగా అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవాన్ని కనుల పండువగా నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి విద్యుత్ కాంతుల నడుమ ఊంజల్‌సేవను చేపట్టారు. సర్వాలంకార శోభితురాలైన అమ్మవారు గజ వాహనంపై నాలుగు మాడ వీధులలో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఏపీఈఏ ఎంసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం నుంచి కొనసాగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు తమకు నచ్చిన కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సులను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. 19వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించిన ఉన్నత విద్యామండలి, 22వ తేదీన సీట్లు కేటాయించనుంది. సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 23 నుంచి 26వ తేదీలోపు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

ఐఐటీ ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం వాయిదా

ఏర్పేడు : ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కామన్ ఇంకుబేషన్ సెంటర్ ప్రారంభం వాయిదా పడింది. ఆదివారం కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్ చేతుల మీదుగా ప్రారంభోత్సవం జరగాల్సి ఉండగా అనివార్య కారణాల వల్ల కార్యక్రమం వాయిదా పడినట్లు ఐఐటీ డైరెక్టర్ డాక్టర్ కేఎన్ సత్యనారాయణ తెలిపారు.

వేదిక్ వర్సిటీ ఉన్నతికి కృషి



పారమార్థిక హోమంలో పాల్గొన్న అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు



నూతన విద్యార్థులకు ఉచిత వస్త్ర ప్రసాదం అందజేస్తున్న అధికారులు

- ఘనంగా వేద విశ్వవిద్యాలయ వార్షికోత్సవం

తిరుపతి సిటీ : టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ వేంకటేశ్వర వేద విశ్వవిద్యాలయం మరింత అభివృద్ధి చెందేందుకు సమష్టిగా కృషి చేద్దామని వర్సిటీ అధికారులు పిలుపునిచ్చారు. వేదిక్ వర్సిటీ సంధ్యావందన శాలలో శనివారం విశ్వవిద్యాలయ 20వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వైఖానస ఆగమ పౌరోహిత్య విభాగ అధ్యాపకుల ఆధ్వర్యంలో సుదర్శన సహిత పారమార్థిక హోమ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సదాశివమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భాస్కరుడు హాజరయ్యారు. హోమ పూర్ణాహుతి అనంతరం వర్సిటీ సంఖాయ ప్రముఖులు బ్రహ్మశ్రీ ఆచార్య గోలి సుబ్రహ్మణ్య శర్మ, ఐకేఎస్ డైరెక్టర్ ఆచార్య తారకరామ కుమార శర్మ మాట్లాడుతూ.. వర్సిటీలో విద్యనభ్యసించిన విద్యార్థులు దేశ, విదేశాలలో అనేక ధార్మిక సంస్థలలో ఉన్నత పదవులలో రాణిస్తున్నారని తెలిపారు. వర్సిటీలో ప్రవేశాలు పొందిన నూతన విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి వర్సిటీ అధికారులు, టీటీడీ అధికారులు సంపూర్ణ సహకారం అందించనున్నారని చెప్పారు. అనంతరం వర్సిటీ అధికారులు నూతన విద్యార్థులకు ఉచిత వస్త్ర ప్రసాదం చేశారు. కార్యక్రమంలో ఫైనాన్స్ అధికారి అంజిరెడ్డి, సంయోజకులు డాక్టర్ భరత శేఖరాచార్యులు, డాక్టర్ నీలకంఠం, సత్యనారాయణాచార్యులు, డాక్టర్ భావ నారాయణాచార్యులు, డాక్టర్ బ్రహ్మాచారులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన భాస్కర్

రేణిగుంట : ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఏర్పేడు మండలానికి చెందిన భాస్కర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ తెలిపారు. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని మర్రిగుంట సర్కిల్ నుంచి విమానాశ్రయ రహదారి వైపు వెళ్తున్న ద్విచక్ర వాహనాన్ని ఎదురుగా వస్తున్న కారు ఢీ కొనడంతో ఏర్పేడు మండలం కాట్రకాయ గుంట గ్రామానికి చెందిన రత్నయ్య కుమారుడు భాస్కర్ (36) అక్కడికక్కడే మృతి చెందాడు. సంఘటన స్థలానికి గాజుల మండ్యం పోలీసులు చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతి ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైస్ ఎంపీపీ సరోజని మృతి



డి.సరోజని

సత్యవేడు: మండలంలోని మదనంబేడు పంచాయతీకి చెందిన వైస్ ఎంపీపీ(వైఎస్సార్‌సీపీ) డి.సరోజని శనివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె మండలం, పార్టీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. ఆమె మృతి పార్టీకి తీరనిలోటని జెడ్పీటీసీ పి.వి జయలక్ష్మి, సర్పంచ్ ఎస్.శివరంజని తదితరులు తెలిపారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి ప్రకటించారు.

అర్చకులకు రూ.5 వేలు



రామకృష్ణారెడ్డి

తిరుపతి అర్బన్: ధూప దీప నైవేద్యాల సమర్పణకు అర్చకులకు రూ.5 వేలు అందిస్తున్నట్లు జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు. టీటీడీ సహకారంతో శ్రీవాణి ట్రస్ట్ ఆధ్వర్యంలో నూతన ఆలయాల నిర్మాణం కోసం రూ.10 లక్షలు అందిస్తున్న నేపథ్యంలో అంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో 130 ఆలయాలకు నిధులు ఇచ్చినట్లు చెప్పారు. గుర్తింపు పొందిన ఆలయాల్లో పనిచేస్తున్న అర్చకులకు రూ.15 వేలు ఇస్తున్నట్లు వివరించారు.

రైల్వే స్టేషన్‌లో 12 కిలోల గంజాయి పట్టివేత

గూడూరు రూరల్ : గూడూరు రైల్వే స్టేషన్‌లోని 4వ నంబర్ ప్లాట్‌ఫారం చివరన అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న వ్యక్తిని గూడూరు రైల్వే పోలీసులు పట్టుకుని అతని వద్ద నుంచి రూ.1.20 లక్షలు విలువ చేసే 12 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు రైల్వే సీఐ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు నెల్లూరులోని రైల్వే డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ మురళీధర్ వివరాలను వెల్లడించారు. నిషేధిత మాదక ద్రవ్య రవాణా నిరోధానికి ప్రత్యేక తనిఖీ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కు చెందిన హరిహరన్ అనే వ్యక్తి టాటానగర్- ఎర్నాకుళం జంక్షన్ ఎక్స్‌ప్రెస్‌లో గూడూరు రైల్వే స్టేషన్‌లో దిగి అనుమానాస్పదంగా ఉండడంతో తనిఖీ చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడంతో పాటు నిందితుడిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో నెల్లూరు రైల్వే ఎస్ఐ మాలకొండయ్య, రైల్వే పోలీసు సిబ్బంది రవి, వెంకటేశ్వర్లు, కిరణ్ పాల్గొన్నారు.

ప్రాణాలతో చెలగాటమా?



తిరుపతి-కరకంబాడి మార్గంలోని రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న భూమన అభినయ్‌రెడ్డి, పార్టీ శ్రేణులు



రోడ్డుపై పడుకుని నిరసన తెలుపుతున్న భూమన అభినయ్‌రెడ్డిని లాగేస్తున్న పోలీసులు

- చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ వచ్చినప్పుడే లైట్లు వెలుగుతాయా?
- ఏడాది కాలంగా వెలగని కరకంబాడి మార్గంలో విద్యుత్ సెంటర్ లైట్లు
- నల్ల దుస్తులు ధరించి మంగళం రోడ్డుపై వైఎస్సార్‌సీపీ శ్రేణుల నిరసన
- విద్యుత్ లైట్లు వెలగకపోతే ఉద్యమాలే భూమన అభినయ్‌రెడ్డి హెచ్చరిక



రోడ్డుపైన నిరసన తెలుపుతున్న పార్టీ శ్రేణులను నిలువరిస్తున్న పోలీసులు

తిరుపతి మంగళం : ప్రజా అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సెంటర్ లైట్లను వెలిగించకుండా వాహనదారుల ప్రాణాలతో చెలగాటమాడుతారా? అని వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి ప్రశ్నించారు. తిరుపతి కరకంబాడి మార్గంలో ప్రజలు, వాహనదారుల అవసరాల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ సెంటర్ లైట్లు ఏడాది కాలంగా వెలగడం లేదు. దీంతో వైఎస్సార్‌సీపీ తిరుపతి నియోజకవర్గ సమన్వయకర్త భూమన అభినయ్‌రెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి నల్ల దుస్తులు ధరించి తిరుపతి-కరకంబాడి మార్గంలో శనివారం పెద్ద ఎత్తున నిరసన చేపట్టారు. విద్యుత్ లైట్లు వీఐపీల కోసమా, ప్రజల కోసమా అంటూ నినదించారు. ప్రజలు, వాహనదారుల రక్షణ కోసం చేస్తున్న నిరసన కార్యక్రమంలో కొంత సేపు ట్రాఫిక్ సమస్య ఏర్పడినా సహకరించాలంటూ ప్లకార్డులు చేతపట్టి వాహనదారులను అభ్యర్థించారు.

అధికారుల నిర్లక్ష్యం

ప్రపంచ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులతో పాటు మంగళం పంచాయతీ, తిరుపతి నగర ప్రజలు నిత్యం ఈ మార్గంలో ప్రయాణిస్తుంటారని తెలిపారు. దాంతో పాటు ఆ మార్గంలోని కళాశాలలకు వెళ్లి వచ్చే విద్యార్థులు నిత్యం రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అయితే విద్యుత్ లైట్లను ఏర్పాటు చేసి ఏడాది కాలం అవుతున్నా వాటిని వెలిగించడంలో టీటీడీ, తుడా, విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. ఈ మార్గంలో వెళ్లే ప్రయాణికులు చిమ్మచీకటిలో ప్రయాణిస్తూ ప్రమాదాలకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలంటే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌కు లెక్కలేదా? అని ప్రశ్నించారు. వెంటనే విద్యుత్ దీపాలను వెలిగించి ప్రజల ప్రాణాలను కాపాడాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అయితే నిరసన కార్యక్రమంలో రోడ్డుపై బైఠాయించి నిరసన చేపడుతున్న అభినయ్‌రెడ్డితో పాటు పార్టీ శ్రేణులను పోలీసులు లాగి పక్కకు నెట్టేశారు. దాంతో పోలీసులు, పార్టీ శ్రేణుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈ నిరసన కార్యక్రమంలో కార్పొరేటర్లు, వివిధ సంస్థల చైర్మన్లు, డైరెక్టర్లు, వివిధ విభాగాల అధ్యక్షులు, పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

విద్యుత్ లైట్లు ప్రజల కోసమా? చంద్రబాబు, పవన్ కోసమా?

భూమన అభినయ్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. గత వైఎస్సార్‌సీపీ పాలనలో టీటీడీ సహకారంతో తిరుపతి-కరకంబాడి మార్గంలోని రోడ్డు మధ్యలో విద్యుత్ సెంటర్ లైట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంగా విద్యుత్ లైట్లకు మోక్షం కలగడంలేదన్నారు. అయితే నాలుగు నెలల క్రితం మంగళంలో జరిగిన కార్యక్రమానికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌వచ్చినప్పుడు మూడు రోజుల పాటు విద్యుత్ సెంటర్ లైట్లు వెలిగాయని, ఆపై మరెప్పుడూ వెలగలేదని మండిపడ్డారు. కేవలం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి వచ్చినప్పుడు మాత్రమే విద్యుత్ లైట్లు వెలిగి ఆపై వెలగకపోవడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారని, విద్యుత్ లైట్లు ప్రజల కోసమా?లేక చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌ల కోసమా? అని ప్రశ్నించారు.



నమూనా విద్యుత్ లైట్లను చూపిస్తున్న అభినయ్‌రెడ్డి

భక్తురాలిపై దురుసుగా ప్రవర్తించిన
అధికారిని తొలగించాలి

- ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆగ్రహం
- హిందూ సంఘాల మండిపాటు

చంద్రగిరి : తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారిని దర్శించుకోవడానికి వచ్చిన ఓ మహిళా భక్తురాలిపై అనుచితంగా ప్రవర్తించిన అధికారిని వెంటనే విధుల నుంచి తొలగించాలంటూ హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఈనెల 8వ తేదీన అమ్మవారిని దర్శించుకోవడానికి ఆలయంలోకి వెళ్లిన మహిళా భక్తురాలిపై ఆలయంలో విధులు నిర్వహిస్తున్న ఓ అధికారి దురుసుగా ప్రవర్తించిన విషయం తెలిసిందే. అధికారి దురుసు ప్రవర్తనతో కన్నీటి పర్యంతమై, అధికారులను నిలదీసింది. దీంతో ఆమెను తోటి ఉద్యోగులు సర్ది చెప్పి, రెండోసారి దర్శనం చేయించి తిరిగి పంపించారు. ఈ ఘటన అక్కడే ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో దుమారం రేపింది. అయితే భక్తురాలిపై దురుసుగా ప్రవర్తించిన అధికారిపై చర్యలు తీసుకోకపోవడంతో హిందూ సంఘాలు మండిపడుతున్నాయి. టీటీడీ ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదంటూ ప్రశ్నిస్తున్నారు. టీటీడీలో ప్రక్షాళన అంటే ఇదేనా అంటూ గుర్రుమంటున్నారు.

కులాన్ని అడ్డుపెట్టుకుని చెలామణి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ అధికారి కులాన్ని అడ్డుపెట్టుకుని చలామణి అవుతున్నాడంటూ హిందూ సంఘాలు ఆరోపిస్తున్నాయి. ఆయనపై గతంలోనూ అవినీతి ఆరోపణలు ఉన్నాయని విమర్శిస్తున్నారు. అధికారంలో ఉన్నది మా పార్టీయే, ఏమి చేసినా చెల్లుబాటు అవుతుందని వ్యవహరిస్తున్నాడన్నారు. ఉన్నతాధికారులు సైతం ఆయనపై చర్యలు తీసుకుంటే ప్రభుత్వ పెద్దలు నుంచి ఇబ్బందులు తప్పవని ఆలోచిస్తున్నారన్నారు. ప్రతి విషయానికి స్పందించే టీటీడీ చైర్మన్, బోర్డు సభ్యులు ఈ విషయంపై ఎందుకు మౌనం వహిస్తున్నారంటూ ప్రశ్నిస్తున్నాయి. ఇప్పటికైనా ఆ అధికారిపై టీటీడీ యాజమాన్యం చర్యలు తీసుకుని, ఆలయంలో విధులు నుంచి తొలగించకుంటే హిందూ సంఘాలు ఐక్యంగా నిరసన కార్యక్రమాలకు దిగుతామని హెచ్చరిస్తున్నాయి.

స్వచ్ఛ సిటీగా తిరుపతి

- సూపర్ స్వచ్ఛ లీగ్ కేటగిరీలో ఎంపిక

తిరుపతి తుడా : మెరుగైన పారిశుద్ధ్యాన్ని అమలు చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2016లో స్వచ్ఛ భారత మిషన్ ఏర్పాటు చేసింది. నగరాల మధ్య స్వచ్ఛ పోటీలతో ర్యాంకింగ్ ద్వారా ఆయా నగరాలను ప్రోత్సహించాలన్న ఉద్దేశంతో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులను ఏటా అందిస్తోంది. 2021 జనాభా ప్రాతిపదికన ఆయా నగరాలలో అమలయ్యే స్వచ్ఛత, పురసేవ ఆధారంగా జాతీయ, రాష్ట్ర, జోనల్ స్థాయి అవార్డుల అందిస్తూ వస్తోంది. ఇందులో భాగంగా 2024 ఏడాదికి సంబంధించి స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులకు ఎంపికైన నగరాల జాబితాను వీడియో కాన్ఫరెన్స్ ద్వారా స్వచ్ఛభారత్ మిషన్ ప్రతినిధులు శనివారం ప్రకటించారు. ఈ క్రమంలో ఆయా నగరాలకు సంబంధించి స్వచ్ఛ అవార్డులు స్థానంలో ప్రెసిడెంట్ ఫోటో సెషన్ అవార్డులకు తిరుపతి చేరింది. సూపర్ స్వచ్ఛ లీగ్ జాబితాలోని తిరుపతి నగరం స్వచ్ఛతలో బెస్ట్ ఫర్ఫార్మెన్స్ సిటీ అవార్డును అందుకోనుంది. ఈనెల 17వ తేదీన ఢిల్లీ వేదికగా భారత రాష్ట్రపతి చేతులమీదుగా అవార్డును అందుకోనుంది.

మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

సత్యవేడు: స్థానిక మహాత్మా జ్యోతిబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో వివిధ తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సత్యనారాయణ తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిమిత్తం విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు జిరాక్స్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో దరఖాస్తులను జూలై 12 నుంచి 19వ తేదీ లోపు అందజేస్తే హాల్‌టికెట్ ఇస్తారు. జూలై 20వ తేదీ ఉదయం 10.30 నుంచి 12.30 గంటల వరకు స్థానిక బాలు ర గురుకుల పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షలో వచ్చే మార్కుల ఆధారంగా సీట్లు భర్తీ చేస్తారు. మరిన్ని వివరాల కోసం 99121 82725, 7989369199ను సంప్రదించవచ్చు.

బ్యాక్‌లాగ్ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరుపతి సిటీ: తిరుపతి జూపార్క్ రోడ్డులోని ఉదయమాణిక్యం మహాత్మా జ్యోతిబా పూలే వెనుకబడిన తరగతుల బాలికల సంక్షేమ గురుకుల పాఠశాలలో 2025-26 సంవత్సరానికి గాను 5, 6, 7, 8, 9 (ఇంగ్లిష్ మీడియం) తరగతుల్లో మిగిలి ఉన్న సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు (పాత చిత్తూరు జిల్లా విద్యార్థులు మాత్రమే) ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ కె.రేష్మ తెలిపారు. ఈ నెల 12 నుంచి 18వ తేదీలోపు పాఠశాలలో దరఖాస్తులు పొందవచ్చునని, పూర్తి చేసిన దరఖాస్తులను 18వ తేదీలోపు పాఠశాలలో సమర్పించాలని కోరారు. ఈనెల 20వ తేదీ ఉదయం 10,30 గంటల నుంచి 12.30 వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9000783185లో సంప్రదించాలని సూచించారు.

కుమార్తె పెళ్లికి తెచ్చిన బంగారు ఆభరణాల చోరీ

- వరుసగా రెండిళ్లలో చోరీ



చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న సీఐలు

చిల్లకూరు : పట్టణంలో శనివారం వేకువ జామున దోపిడీ దొంగలు హల్ చల్ చేశారు. పట్టణంలోని గమ్మళ్లపాళెం, అశోక్‌నగర్ ప్రాంతాలలో రెండిళ్లలో చోరీకి పాల్పడి సుమారు 32 సవర్ల బంగారు ఆభరణాలను అపహరించినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల వివరాల మేరకు గూడూరు పట్టణనడి బొడ్డున ఉన్న గమ్మళ్లపాళెంకు చెందిన పరుచూరి శివయ్య తన కుమార్తె వివాహం ఆగష్టులో నిర్ణయించుకోవడంతో ఇంటిలో ఉన్న సొమ్ముతో పాటుగా అప్పు చేసి సుమారు 32 సవర్ల బంగారు ఆభరణాలు చేయించి ఇంటిలోని బీరువాలో ఉంచాడు. తన కుమారుడు చైతన్యను ఇంటిలోనే ఉంచి నెల్లూరులో ఓ పని మీద కుటుంబ సభ్యులు అందరూ వేకువజామున వెళ్లారు. ఇది గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి వెనక బాగం నుంచి లోనికి ప్రవేశించి బీరువాలోని బంగారు ఆభరణాలను చోరీ చేశారు. కుమార్తె పెళ్లికి తెచ్చి పెట్టిన బంగారు ఆభరణాలు చోరీకి గురి కావడంతో కుమార్తె పెళ్లి ఎలా చేయాలని శివయ్య కన్నీటి పర్యంతం కావడం అక్కడ ఉన్న వారిని కలచి వేసింది. అలాగే సమీపంలోనే ఉన్న అశోక్ నగర్‌లోని శేషయ్య ఇంటిలో కూడా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. శేషయ్య ప్రస్తుతం తన కుమార్తె హైదరాబాద్‌లో ఉంటుండడంతో ఆమె వద్దకు వెళ్లడంతో ఇంటిలో చోరీ జరిగినట్లు తెలుస్తోంది. ఇక్కడ ఎంత మేర నగలు, డబ్బులు చోరీ జరిగిందనే విషయం ఆయన ఫిర్యాదు మేరకు పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. గూడూరు డీఎస్పీ గీతాకుమారి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే గూడూరు ఒకటో పట్టణ సీఐ శేఖర్‌బాబు, వాకాడు సీఐ హుస్సేన్‌బాషా సంఘటనా స్థలంలో పరిశీలించిన అనంతరం క్లూస్ టీంకు సమాచారం ఇవ్వగా వారు వేలిముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

‘తొలి అడుగు’లో తమ్ముళ్ల కీచులాట

బుచ్చినాయుడుకండ్రిగ : సుపరి పాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా శనివారం బుచ్చినాయుడు కండ్రిగకు తొలిసారిగా విచ్చేసిన సత్యవేడు నియోజకవర్గ టీడీపీ పార్టీ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ కూరపాటిశంకర్‌రెడ్డి ఎదుట తెలుగు తమ్ముళ్లు తోపులాడుకున్నారు. బుచ్చినాయుడుకండ్రిగలోని పార్టీ కార్యాలయం వద్ద కూరపాటిశంకర్‌రెడ్డి పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో శంకర్‌రెడ్డితో పాటు మండల మాజీ ఎంపీపీ బట్టా ఇందిరమ్మ భర్త బట్టా రమేష్ యాదవ్ సభా వేదికపై కూర్చున్నారు. సభ వేదికపై ఉన్న నాయకులందరినీ మండల నాయకులు శాలువ కప్పి, పూలమాల వేసి ఘనంగా సన్మానించారు. ఈ క్రమంలో వేదికపై ఉన్న బట్టా రమేష్‌యాదవ్‌ను నాయకులు సన్మానించకపోవడంతో టీడీపీలో తనకు తగిన గౌరవం లేదని నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై మండల నాయకులు.. పార్టీలు మారే వారిని గౌరవించేది లేదని, సన్మానం చేయమని వాదనకు దిగారు. అక్కడే ఉన్న రమేష్ యాదవ్ కుమారుడు గిరీష్‌యాదవ్ కలగజేసుకుని పార్టీ కోసం పనిచేసిన వారిని అవమానించడం తగదని కేకలు వేయడంతో ఒక్కసారిగా సమావేశం రసాభాసాగా మారింది. దీంతో రమేష్‌యాదవ్ వర్గం, మండల టీడీపీ నాయకులు ఒకరిని ఒకరు తోపులాడుకున్నారు. ఇది గమనిస్తున్న శంకర్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌నాయుడులు సర్ది చెప్పడంతో గొడవ సద్దుమణిగింది. అనంతరం సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలను పంపిణీ చేశారు.